# ‘మహిళలను చిన్నచూపు చూడొద్దు’

**వడాల, న్యూస్‌టుడే:** నేటి సమాజంలో మహిళలను చిన్నచూపు చూస్తున్న మాట ఎంత వాస్తవమో, మహిళలకు మహిళలే శత్రువులన్నది అంతే నిజమని వైద్యురాలు గాయత్రీ దేవి అన్నారు. వర్లీలోని పద్మశాలి సమాజ సుధారక మండలి మహిళా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గాయత్రీ దేవి మాట్లాడుతూ.. పురాణాల్లోని స్త్రీలు నేటి ఆధునిక మహిళలకు ఆదర్శనీయమని, అందుకు ద్రౌపది, సత్యభామలాంటివారే నిదర్శనమని కొనియాడారు. గర్భంలో ఉన్న శిశువు ఆడపిల్ల అని తెలిసిన మరుక్షణమే చంపేస్తూ ఆ తల్లులే వారిపాలిట శత్రువులుగా మారతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విషయాల్లో మహిళలందరిలో పూర్తిగా మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం మండలి అధ్యక్షుడు వాసాల శ్రీహరి మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఎన్నో స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మచ్చ సుజాత బృందం ‘హమ్ హోంగే కామ్‌యాబ్’ అనే పాటతో సభికులను అలరించారు. మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ముఖ్యఅతిథి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ మంతెన రమేశ్, ప్రధాన కార్యదర్శి కస్తూరి హరిప్రసాద్, మహిళా శాఖకు చెందిన దుడుక అనూరాధ, పాపన్ శారద, చిలివేరి విజయ, సభ్యులు మర్రి జనార్దన్, గంగరాజం, గుడ్ల మహేందర్, సంతోష్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



**కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యురాలు గాయత్రీ దేవీ**